# దశ తిరిగింది

దశానికి స్వాతంత్ర్యం వచ్చి నలభైయేడు సంవత్సరాలు దాటినా...

మా గ్రామం కరెంట్‌కి నోచుకోలేదు. రక్షిత మంచినీటి సౌకర్యం లేదు. అందరూ చెరువు నీటిమీదే ఆధారపడి జీవిస్తున్నారు.

నేరుగా బస్సు ఊళ్లోకి రావడం అనేది గ్రామస్తులు చూడ్లేదు. బస్సు దిగేక రెండు కిలోమీటర్లు డొంకదారిన నడిస్తేగాని ఊళ్లోకి రాలేరు.

రోగమొస్తే వైద్యసౌకర్యంకోసం ఎడ్లబండిమీద పదికిలోమీటర్ల దూరం వెళ్లడం తప్పనిసరి.

వ్యవసాయమే అక్కడివాళ్లకు జీవనాధారం. డబ్బున్న కామందులు ఇళ్లు ఓ ఇరవైదాకా వుంటయ్-నలభై శాతంవరకు ఆర్థికపరమైన ఇబ్బందులు లేని మధ్యతరగతివాళ్లు... మిగతావారంతా బీదాబిక్కి... రెక్కాడితేగాని డొక్కాడనివాళ్లు.

అగ్రకులాలవారి ఆధిపత్యం ఇంకా మా గ్రామంలో రాజ్యమేలుతోంది.

ఊళ్లోవున్న చెరువులో కుడివేపు ఒడ్డునవున్న బండరాతి మెట్లు దిగి ఆడామగాతో తమ ఇత్తడి బిందెలతో కావిళ్లతో మంచినీళ్లు పట్టుకోవాలి. నిమ్నకులాల వాళ్లు అరకిలోమీటరుదూరంలో అవతల ఎడమవేపు ఒడ్డునున్న మెట్లుదిగి నీరు వాడుకోవడం అక్కడి సాంప్రదాయం.

మా వూళ్లో రాజకీయాలకేం కొదవలేదు. కుల రాజకీయాలతో, కక్షలతో గ్రామం కుళ్లిపోతోంది.

వర్షాకాలంలో ఊరిమధ్యగా వున్న చెరువులో గ్రామంలో పిల్లలు ఈతకొడుతున్నారనే విషయం తెలిసి రాద్ధాంతం చేశారు.

మంచినీటి చెరువులో కడజాతి కులానికి చెందిన పిల్లలు ఈత కొట్టడం నేరమైంది. అగ్ర కులాల పెద్దలు, పసివాళ్లని దిశమొలతోవున్నారనే జాలి సానుభూతి లేకుండా చావబాదేశారు.

వెనకబడ్డవర్గంలో ఇంకా అజ్ఞానం అమాయకత్వం కాపురం చేస్తూనే వుంది. అక్షరజ్యోతి కార్యక్రమం వంటివి గ్రామం పొలిమేరల్లోకి కూడా అడుగు పెట్టలేకపోయాయి.

గ్రామంమధ్యలో పంచాయతీసమితివారు ఏర్పాటుచేసిన రేడియో మోగుతున్నా బీదాబిక్కీ ఆ ఛాయలకొచ్చి వినగల ధైర్యం లేదు.

అలాంటి దిక్కుమాలిన మా గ్రామానికి మంచిరోజులొచ్చాయో ఏమో... డొంకరోడ్డు స్థానంలో తారురోడ్డు వేయడానికి పనులు చురుగ్గా సాగడం చూచిన నాకు ఆశ్చర్యం వేసింది.

సూర్యాస్తమయం కాబోతోంది.

అరుగుమీద కూర్చుని చుట్టలు కాలుస్తున్న బుర్రమీసాల ఆసామిదగ్గర నిలబడ్డదో బక్కప్రాణం.

''ఏందిరా నీయమ్మ, ఇట్టాసచ్చినావ్?...'' తుపుక్కువుమ్మేసి బక్కప్రాణం వాడిని అసహ్యంగా చూస్తూ కసిరినట్టే అడిగేడు ఆసామి.

''పుగాక్కాడ ఈ యదవముకాన కొట్టుదొరా!...'' బక్కప్రాణం అర్థించింది.

''ఇంద... సావు...'' అంటూ ముఖాన విసిరేశాడు ఆసామి.

భక్తితో అందుకుని కళ్లకద్దుకుని 'దరమ ప్రభువులు...''అంటూ ఆసామి కాళ్లదగ్గరే చతికిలబడ్డది బక్కప్రాణం.

''నా ఎదురుగా కాల్చావంటే నరికి పోగులు పెడ్తా...'' కసిరాడా ఆసామి.

''అంత ధైర్నమా దొరా... అయ్యా... మనూరికి మంత్రి గారొత్తున్నారంటగా?...''

''అందుకేరా మనూరి కళే మారిపోయి తార్రోడ్డు ఏస్తున్నారు.''

''ఆయనగొరెందుకొత్తున్నట్లో...''

''నిన్ను చూడ్డానికి! ఎదవనాకొడక!''

ఏడవలేక నవ్వింది బక్కప్రాణం.

''తెలవక అడిగాన్లే దొరా... మనూరికి అదృష్టం పట్టిందోచ్!'' చుట్టపీకని దూరంగా విసిరేడు బక్కజీవి.

''మా బతుకులు బాగుపడుతయ్యంటారా...'' బక్కప్రాణం మాటల్లో ఆశ జేవురించింది.

''మీరంతా బాగుబడితే మమ్మల్ని బతకనిస్తారంట్రా... జన్మజన్మలకీ మీరు ఆడనేవుండాల... లేకపోతే దేశం నాశనమైపోదూ?...''

''దొరా... మనూరి చివర ఏదో ఫ్యాక్టరీ పెట్టబోతారంటగా... అదిగనక వత్తే... నా కొడుక్కి కూలీపని ఇప్పిద్దూ...'' యాచించాడు బక్కజీవి.

''గంజినీళ్లు తాగే నీ కొడుక్కి కూలీపనా... ఒరేయ్... వళ్లు దగ్గరుండే మాట్లాడుతున్నావా?''

''దయపెట్టండి దరమ పెబువులు... మీ కాలికి కిర్రుసెప్పులు సాయంగా కుట్టి ఇత్తాను...''

''నా కాళ్లకు సెప్పులు నువ్వేందిరా కుట్టి ఇచ్చేది... ఎదవనాయాల! నువ్వు చెప్పిన చోటులో తోళ్లఫ్యాక్టరీ రాబోతోంది. చెప్పులు, బూట్లు తయారుచేసి విదేశాలకి ఎగుమతి చేస్తారు - తెల్సా?''

''అంటే... నాబోటివాడి నోట్లో దుమ్ముకొడతారా?'' బక్కప్రాణం మాటల్లో బాధ ధ్వనించింది.

''దొరా! నాకు తెలవక అడుగుతా... మంతిరిగోరిది మనూరేనంటగా...''

''అవున్రా - నీకు తెలవదా? పెంచలయ్య మూడో కొడుకు ఈ మినిస్టరు బాబు!''

''పెం... చ... ల... య్య!'' తన్లో తాను గొణుక్కున్నాడు బక్కజీవి.

''అదేరా... మనూరి చివర చింతలతోపు పక్కన ఓ గుడిసెలో వుండేవాడు గొర్రెల్ని మేపుకుంటూ... ఆడి కొడుకే... ఈయనగోరు! రాజకీయాల్లో చేరి గొప్పోడయ్యాడు. బాగా సంపాదించాడుగదా... మనూరిని మర్చిపోలేక ఇక్కడ వ్యాపారం పెడితే బావుంటుందన్పించి... ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వస్తున్నాడు-అర్థమైందా?''

''మాబోటోళ్లని ఉద్ధరించడానికి వస్తన్నాడేమో అనుకున్నానే దొరా!...''

''ఓరి అమాయకుడా! నీకు బొత్తిగా పెపంచకం తెలీదురా... పెంచలయ్య గంజిపోసి కొడుకుల్ని ముగ్గుర్నీ పెంచాడు. పెద్దచేశాడు. అదృష్టం బావుండి తెలివితేటల వల్ల రాజకీయాల్లో రాణించి మంత్రి అయ్యాడు - పాతజీవితాన్ని మర్చిపోయి... రెండుచేతులా సంపాదిస్తున్నాడు. ఇంకా మీరెందుకు గుర్తుంటార్రా... ఆయనగారి కడుపు నిండిందిగా... సర్లే, నువ్వింటికెళ్లు'' అనేసి ఇంట్లోకి దారితీశాడు ఆసామి.

★★ ★★ ★★

కొత్తపెళ్లికూతుర్లాగా గ్రామం ముస్తాబవుతోంది. ఊరంతా జండాల తోరణాలు... స్వాగతద్వారాలు వెలిశాయి. పోలీసుబలగంవచ్చి దిగింది. ముందు జాగ్రత్త చర్యగా ప్రతి ఇల్లూ గాలించారు.

జీపుల్లో... కారుల్లో వచ్చేపోయే అధికార అనధికారులతో సందడిగా వుంది.

మంత్రిగారు బహిరంగసభలో ఉపన్యసించడంకోసం ఊరిచివర పేద్ద ఖాళీ స్థలంలో ఎత్తయిన వేదిక ఏర్పాటైంది.

శంకుస్థాపన వంకతో అయినా మంత్రిగారు గ్రామానికొస్తున్న కారణంగా వూరు బాగుపడ్డట్టయింది. మంత్రివరేణ్యులు వెళ్లిపోయిన మరుక్షణం ఇంత సందడీ మటుమాయమైపోతుంది.

మళ్లీ గ్రామంలో చీకటి అలముకుంటుంది. ఎవరి బ్రతుకులు వారిని. ఎవరి రెక్కల కష్టం వారిది. ఎద్దుపుండు కాకికేం ముద్దు?

బక్కప్రాణం ప్రతిక్షణం పెంచలయ్యగురించే ఆలోచించసాగింది. ఫ్యాక్టరీలో తన కొడుక్కు కూలీపనికోసం పెంచలయ్యచేత మంత్రిగారికి చెప్పించాలనుకున్నాడు. కన్నతండ్రిమాట కొడుకు వినకపోతాడానిపించింది.

పెంచలయ్యని కల్సుకోవడంకోసం చింతతోపువేపు నడచింది బక్కప్రాణం. ఆసామి చెప్పిన గుడిసెకూడా అవుపించింది.

గుడిసెముందున్న కుక్కి నులకమంచంలో ఓ రోగిష్టిమారి వ్యక్తి పడుకుని దగ్గడం చూచింది బక్కప్రాణం.

ఆ మడిసి సావుబతుకుల్లో వుండడం చూసి జాలిపడ్డది బక్కప్రాణం.

''పెంచలయ్య నువ్వేనా?'' మంచానికి దగ్గర్లో నిలబడి అడిగింది బక్కప్రాణం.

తలూపాడు పెంచలయ్య. పెంచలయ్య దీనావస్థకి బక్కప్రాణం కళ్లు చెమర్చినయ్.

''నీ కొడుకు మంతిరిగందా... నీకీ అవస్తేంది?''

''నా కరమ... నాకు సావురాకుండా వుంది-నన్ను సూసేవాళ్లు లేకుండా పోయారు సివరికి...''

''నువ్వూ... నీ కొడుకుతోబాటు పట్నంలో దర్జాగా వుండక... ఇదేం కరమంట?'' బక్కప్రాణం మాటల్లో జాలి ధ్వనించింది.

''ఆడు నా కొడుక్కాదయ్యా... కరకోటకుడు - ఆళ్లమ్మ సచ్చిపోతేనే సూట్టానికి రాలేదు. ఆడి రాజకీయాలేందో వాడేందో... నా కడుపున సెడబుట్టాడు. ఆ దేవుడు నన్ను తొరగా తీసుకెడితే బావుండు...'' ఆయాసపడుతూనే మాట్లాడాడు పెంచలయ్య.

పెంచలయ్య పరిస్థితి కళ్లారాచూస్తూ... తానొచ్చినపని మర్చేపోయింది బక్కప్రాణం.

★★ ★★ ★★

మంత్రిగారు సర్వలాంఛనాలతో శంకుస్థాపన కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముగించారు.

ఎండతీవ్రత తగ్గేక బహిరంగసభలో మాట్లాడడానికి బయల్దేరి సభాస్థలికి చేరుకన్నారు.

గ్రామంలో జనాన్నేకాకుండా... లారీల్లో చుట్టుప్రక్కల గ్రామాలనుంచి కూడా డబ్బిచ్చి లాక్కురాబడ్డ అలగాజనంతో ఆ ప్రదేశం కిటకిటలాడుతోంది.

మంత్రిగారి ఉపన్యాసం మొదలైంది:

"నా ప్రియమైనా ప్రజలారా! మీరన్నా... ఈ ఊరన్నా నాకెంతో అభిమానం. ప్రజాసేవకోసం... శ్రేయస్సుకోసమే నేను ఊపిరి పీలుస్తోంది... బ్రతుకుతోంది! నా ఇరవై ఏళ్ల రాజకీయ జీవితాన్ని ప్రజలకే-అంటే మీకే అంకితం చేశానే నిజం మీ అందరికీ తెలుసు! ఈ ఊరు నాది - మీరంతా నా వాళ్లు... నేను పుట్టింది పెరిగిందీ ఈ గ్రామంలోనే! మన దేశ ప్రగతి... పురోగతితో మన గ్రామాన్ని పోల్చిచూస్తే... ఈ గ్రామం ఇంకా వెనకబడి వుండడం చూస్తుంటే నాకెంతో బాధగా వుంది. నా శాయశక్తులా కృషిచేసి ఈ వూరినీ... ఇక్కడి ప్రజలను ఉద్ధరిస్తానని మీకు మాట ఇస్తున్నాను. ఈ ఊరికి కరెంటు తెప్పిస్తాను. ఇక్కడ స్కూలు కట్టిస్తాను. బీదాబిక్కీ... వెనుకబడిన బలహీనవర్గాలవారి జీవితాల్లో నందనవనం విరిసేట్టు చేస్తాను" - ఉద్రేకంతో, ఆవేశంతో ఉపన్యసిస్తున్నారు మంత్రివరేణ్యులు.

"ఒరేయ్... ఎదవనాకొడకా... ఎందుకురా అపద్దాలు చెప్తావ్? కన్నతండ్రికి కూడుబెట్టనోడివి దేశాన్ని బాగుసేత్తానంటావా? ఇదిగో పజల్లారా... ఈడి మాటలు నమ్మద్దు... ఈడు నయవంచకుడు... కర్కోటకుడు... కాదు... కసాయివాడు..." పెంచలయ్యలో నీరసం, నిస్త్రాణ ఆవహించడంతో లేచినిలబడి గొంతు పగిలేలా అరుస్తున్నవాడల్లా కుప్పకూలిపోయాడు.

జనం మధ్యలో వుండి అరిచిన అరుపులు మంత్రిగారికి వినిపించలేదు. కానీ పోలీసోళ్లు మాత్రం పెంచలయ్యని గమనించి... ఒక్క ఉదుటున అక్కడికొచ్చి పెడరెక్కలువిరిచి ఈడ్చుకుంటూ దూరంగా లాక్కెళ్లారు.

''మన గ్రామంలో కూడా సంఘవిద్రోహశక్తులు... అరాచకాన్ని సృష్టించే శక్తులు వున్నాయనే విషయం నాకిప్పుడే బోధపడ్డది. అలాంటి శక్తులను నిర్దాక్షిణ్యంగా అణచివేసి ప్రజల సుఖమయ జీవితాలకు రక్షణ కల్పిస్తానని సభాముఖంగా మీ అందరికీ హామీ ఇస్తున్నాను.''

మంత్రిగారి ఉపన్యాసం సాగిపోతోంది ప్రవాహంలాగా...

---

★ *(డిశంబరు 1994 ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రికలో ప్రచురితం)*